కథానిక :

భాగస్వాములు

శ్రీ పుత్రేవు సత్యనారాయణమూర్తి

1

“అమ్మా! మర్రొండు బంగాళాదుంప ముక్కలు వెయ్యే!”

‘అన్నయ్యకు వేస్తే నాకూ వెయ్యమ్మా, మరి.”

కంచంలోఉన్న ముక్కలన్నీ తొందర తొందరగా దిగమింగుతూ, రామారావు కూడా అందుకున్నాడు.—“అమ్మా! నేనూ ముక్కలన్నీ తినీసేను. నాకూ వెయ్యాలి సుమా!”

‘నీకు రెండుమాట్లు వేసింది కాదుట్రా?’

‘నీకుమాత్రం వెయ్యలేదేమిటె, మూడుమాట్లు?’

‘నాకు మూడుమాట్లెక్కడ వేసిందిరా?’

‘మరి నాకు రెండుమాట్లెక్కడ వేసిందిరా?’

‘నీవన్నీ అబద్ధాలే.’

‘నీవి అంతకంటే అబద్ధాలు.’

‘నాపూసు నీ కెందుకురా?’

‘నావూసు నీకెందుకురా?’

‘నేను ముందువెయ్యమని అడిగేను తెలుసా?’

‘నేను ముందు ముక్కలువేపు చూ సేను తెలుసా?’

‘చూస్తేమాత్రం?’

‘అడిగితే మాత్రం?”

‘నేను అమ్మతోటి పొద్దున్నే చెప్పేను తెలుసా?’

‘నేను అమ్మతో రేపే చెప్పేను తెలుసా?’

‘అమ్మా చూడే, రామిగాడు?’

‘నేను రామిగాడి నిట్రూ?’

‘కావేమిట్రా మరి?’

‘అయితే నువ్వు వట్టి వెంకయ్యవిలే.’

‘అయితే నువ్వు వట్టి రామిగాడివిలే.’

‘తంతాను చూసుకో.’

‘నేను అంతకంటే తన్నగల్ను తెలుసా?’

‘ఏదీ, తన్నరా, ఏపాటి తన్నగలవో?’

‘ఏదైతే నువ్వు తన్ను, చూద్దాం.’

‘నేను తన్నలేననుకున్నావా?’

‘నేనుమాత్రం తన్నలేననుకున్నావా?’

‘తాతలు దిగిరావాలి.’

‘ముత్తాతలు దిగిరావాలి.’

‘వాకట్లో కెళ్ళి పడాలన్నమాట.’

‘వీథిలో కెళ్ళి పడాలన్నమాట.’

“ఏదీ తన్ను చూద్దాం మరి?”

“నువ్వు తన్ను చూద్దాం మరి?”

“ఇదిగోట్రా!”

వెంకట్రావు రామారావు వీపుమీద ఒక్క చరుపుచరిచి అడిగేడు—“అయిందా?”

రామారావు తిరిగి తన్నడానికి చెయ్యి విసిరేడు కాని అన్నకి తగలలేదు. వెంటనే 'బాకా' మొదలు పెట్టేడు.

మొదట బంగాళాదుంపల ముక్కలు వెయ్యమని అడిగిన పెద్దకొడుకు గోపాలరావు ఈ గలభా చూస్తూ తనమాట మర్చిపోయేడు.

మోహనరావుగారి భార్య సీతమ్మ ఆదినం ఉదయం అతి బలవంతంమీద ఏదో చేదుమందు త్రాగినది. చిన్నతనంలో, ఆవిడ అలాంటి చేదుమందు తాగిననాడు సాయంకాలం, ఆవిడ తండ్రి ప్రత్యేకంగా బజారునుండి బంగాళాదుంపలు తేవడము, తల్లి ఆప్యాయంగా వేపడంచేసి పిల్లకి వెయ్యడము, అలవాటు. మోహనరావు యిప్పుడు తన ఇంట్లోకూడా ఆ ఆచారాన్ని అమలుపరుస్తున్నాడు. ఇంట్లో భార్య కాని, పిల్లలు కాని ఏదైనా చేదుమందు తాగితే ఆదినం వాళ్ళకి పండుగే. ఆరాత్రి తప్పకుండా బంగాళా దుంపలు వేపడం ఉంటుంది. అయితే, ఏ రోజున ఎవరు అలాంటి మందు తాగుతారో ఆరోజున వాళ్ళకే వేపడం పైని ప్రత్యేకపు హక్కు వుంటుంది. నేడు ఆ మందు త్రాగినది అతని భార్య. తాను బంగాళాదుంపలు తెచ్చినది ముఖ్యంగా ఆమె కొరకే.

పిల్లలు చేస్తున్న గల్లంతు మోహనరావు, సీతమ్మ చూస్తూనే ఉన్నారు. అయితే చూస్తూ ఊరుకున్నారా? అంటారా? ఆహా! ఊరేకున్నారు. ఊరుకోనక ఏంజేస్తారు? ఇది వాళ్ళకి క్రొత్తగనకనా? కొట్టుకోనడాలూ, తిట్టుకోనడాలూ లేకుండా పిల్లలు భోజనంచేసిన దెప్పుడు కనుక? వాళ్ళకి ఇది బాగా అలవాటు అయిపోయింది. కొట్టుకునో, తిట్టుకునో, వాళ్లచేతులూ, నోళ్ళూ నొప్పెట్టి, వాళ్లంతట వాళ్లు ఊరుకోనవలసినదే కాని, వాళ్ల తగువులు తీర్చడం వాళ్ల తరంగాదుగదా, వాళ్లని పుట్టించిన బ్రహ్మతరం కూడా కాదు. ఇంతకూ వాళ్లు తిట్టుకోనడం, కొట్టుకోనడం, గుత్తళంలోని చీమ టపాకాయిలు పటపట పేలినట్లు ఒక్క క్షణంలో జరిగిపోయాయి. రాముడు బాకా పెట్టేడంటే రామేశ్వరం దాకా వినబడుతుంది. వాడిని ఊరుకోబెట్టడానికి ఊరంతా ఏకమైనా చాలదు. సీతమ్మకు ఈ వేళ ఎక్కువ నీరసముగా ఉండడంవల్ల పిల్లలనోట్లో నోరుపెట్టి, వాళ్లని కసిరి, గదమాయించ లేకపోయింది. కాని రాముడు పెట్టిన బాకా విని ఊరుకోనలేకపోయింది కూడా.

"ఏమిరా! ఎందు కలాగ కొట్టుకు ఏడుస్తారురా? మీకు కావలిస్తే నన్ను అడగకూడదూ? వేస్తాను. మీలో మీరెందుకు అలాగ తన్నుకోవడం?" అంటూ సీతమ్మ పళ్లెంలోని బంగాళా దుంప ముక్కలుతీసి వాళ్లకు వేసే నిమిత్తం, వంగి ముక్కలు తీస్తూంది. పళ్లెంలో ఇంక కొంచెము ముక్కలు మాత్రము మిగిలిఉన్నాయి. అప్పటికే పిల్లలు రెండుమూడు మార్లు అడిగి అడిగి వేయించుకున్నారు.

మోహనరావు పళ్లెమువైపు చూసేడు. ఒక ప్రక్క భార్య, ఒకప్రక్క పిల్లలు. పళ్లెములో మిగిలిన ముక్కలు కొంచము. ఆ కొంచము ముక్కలూ కూడా పిల్లలకు వెయ్యడానికి భార్య సిద్ధముగా ఉన్నది. ఆమెకు తనమాట ఏమిటన్న ప్రసక్తియేలేదు! తన పిల్లలే తాను, తానే తన పిల్లలు. మరి మోహనరావు కఠిన హృదయుడా! అతనికి పుత్రవాత్సల్యం లేదా? ఉంది. కాని, ప్రస్తుత పరిస్థితిలో అతని త్రాసుముల్లు పుత్రవాత్సల్యంకంటె కళత్ర ప్రేమవైపు ఎక్కువ మొగ్గుచూపింది. కారణం? ఆ దినం మందు త్రాగింది తన భార్య. తాను అసలు, బంగాళా దుంపలు తెచ్చినది ఆమెకొరకు. వేయించిన ముక్కలలో ఒక ముక్క ఐనా ఆమె నోట్లో పడకుండా అన్నీ తనూ పిల్లలూ కలిసి కాజేస్తే, ఆమె మాట ఏమిటి?" ఇది అతని మనస్సును కలత పెట్టుతున్న మాట. అతడు భార్యతో కచ్చితమైన స్వరంతో అన్నాడు—'ఇంక ఆ ముక్కలు ఎవరికీ వెయ్యకు, చెబుతున్నాను. ఇటు రా.' భార్యపైనున్న ప్రేమ పిల్లలపైని తాత్కాలిక క్రోధంగానూ, అసూయగానూ పరిణమించినది. అతడు తన పిల్లలను గద్దిస్తూ అన్నాడు. "వెధవల్లాలా! ఎన్నిమార్లురా వెయ్యడం మీకు? మీరు చేదు మందు తాగేరా, ఏమైనానా? అన్ని ముక్కలూ మీగే మింగేస్తే మరి మందు తాగిన అమ్మకి ఏమీ మిగలక్కరలేదా?"

"నాన్నగారూ, నేనూ రేపు ఆమందు తాగేస్తానండీ."

"నాన్నగారూ, నేను నిన్న ఆమందు తాగేస్తానండీ."

"నాన్నగారూ, నేను ఒక్క చుక్క క్రింద పడకుండా తాగేస్తానండీ."

"వీడు కాళ్ళల్లో పడుకోబెట్టుకుని నోట్లో తాళం పెట్టి పోస్తేగాని తాగడండీ."

“నాన్నగారూ! అన్నయ్య తాగిన మందంతా, ఉమ్మేస్తాడండీ.”

మోహనరావు కోపం వీళ్ల సంభాషణ వింటుంటే, తగ్గిపోయినది. అన్నాడు—‘సరేలెండి, రేపు ఎవరు అల్లరి చెయ్యకుండా తాగితే వాళ్లకి కావలసినన్ని బంగాళా దుంపలు తెస్తానులెండి. ఇప్పుడు మాత్రం ఇంక అల్లరి పెట్టకండి.”

“నాన్నగారూ, నాకు బుట్టతోటి బుట్టెడు దుంపలు పట్టుకురండీ.”

“నాన్నగారూ నాకు బస్తాతో బస్తాడు తెండి”

పెద్దకుమారుడు గోపాలరావు కొంచం మొగ మోటస్థుడు. భయస్థుడు. ఇంతవరకూ అన్నంలో మరేవో కలుపుకుని తింటున్నాడు. తల పైకెత్తి నవ్వుతూ అన్నాడు—‘నాన్నగారూ, వీళ్లద్దరికీ వొద్దు, నాకు తెచ్చిపెట్టండీ.”

సీతమ్మ మనస్సు ఉండబట్టలేదు. భర్తకు తనపై గల ప్రేమను ఆమె గుర్తించకపోలేదు. అయితే మాత్రం! పిల్లలకు బంగాళాదుంపలంటే ఎంతో అంత ఇష్టం. ప్రొద్దుట వాళ్ళనాన్నగారు బజారుకు వెళ్ళి నప్పటినుంచి, బంగాళాదుంపలు తెస్తారని, గంటల కొద్దీ వీధి గుమ్మంలో కూర్చున్నారు. ఆయన బజారు నుంచి వచ్చి, వీధిగుమ్మంలో అడుగుపెట్టగానే, ‘నాన్నగారూ, సంచీ నాకు యివ్వండీ అంటే నాకు యివ్వండీ.’ అని తగవులాడేరు. ఆఖరుకి తండ్రి ఆ తగువు తీర్చలేక, తనూ పిల్లలూ కలిసి సంచీని యింట్లోకి సాయం పట్టుకువచ్చారు. పిల్లలు సంచీ నొక్కి చూసేరు. ‘అయ్, హాయ్! నాన్నగారు బంగాళాదుంపలు తెచ్చేరోయ్!’ అని ఎగిరేరు. ‘నేను అమ్మతో చెబుతాను.’ అంటే నేనే ముందు చెబుతాను’ అంటూ ఇద్దరూ, సంచీ వదిలివేసి వంటింటివైపు పరుగెత్తేరు. వెంకట్రావు జోరుగా పరిగెత్తి గుమ్మంతగులుకుని బోర్లాపడ్డాడు. రామారావు వాడిని దాటిపోయి, ‘అమ్మా, బంగాళాదుంపలు తెచ్చేరు, నాన్నగారు.’ అని పాటవరసలో పాడు కుంటూ అమ్మదగ్గిరికి వెళ్లేడు. వెంకట్రావు, దెబ్బ లక్ష్యపెట్టకుండా, తనవద్దకు వచ్చి ‘నేనే నాన్నగారి దగ్గిర సంచీ ముందుగుండా పుచ్చుకున్నానమ్మా!’ అని గొప్పగా చెప్పేడు.

ప్రొద్దుటనుండీ వాళ్ళ సందడి చెప్పడానికి వీల్లేదు. పాపం వాళ్ళకి పెట్టకుండా దాచుకుని తాను తినగలదా? తన గొంతుక దిగుతుందా? ఈవిధంగా ఆమె మానసకాసారంలో తరంగాలు అల్లకల్లోలంగా పొంగి పొర్లెత్తాయి. ఉన్నముక్కలు నాలుగూ ఊడిచి ముగ్గురు పిల్లల కంచాల్లోనూ సర్దేద్దామనే ఉద్దేశంతో ఆమె పళ్ళెంలో చేయిపెట్టి ముక్కలు తీస్తున్నది. మోహనరావు ఆమెపై కోపము ఎక్కువయింది. తన విస్తట్లో మిగిలిఉన్న ముక్కలు తీసి యిద్దరు చిన్నపిల్లల కంచాల్లోనూ సర్దివేసి, “ఇదిగో నేను వేస్తున్నాను. ఇంక మళ్ళీ అమ్మని వెయ్యమని అడిగేరంటే మాత్రం చావగొట్టేస్తాను, తెలుసా?” అన్నాడు.

“అదేమిటండీ, బాగానేవుంది! మీకు వేసిన ముక్కలు వాళ్లకెందుకు వేసేసేరు? నేను వేస్తుండగా?” అన్నది సీతమ్మ.

“చాలులే! చాలా గొప్పపని చేస్తున్నావుగాని, ఇంక ఆ ముక్కలు అలాగ ఉండనిచ్చుకుని నువ్వు తిను. అవిగాని పిల్లలికి వేసేవంటే మరి ఊరుకోను.”

“అసలు మొదట అడిగినవాడు గోపిగాడు. ఈ వెనవల అల్లరికి భయపడి పాపం, వాడు మళ్ళీ అడగటమే మానివేసినాడు. వాడికి మారైనా వెయ్యలేదు. మజ్జిగ, అన్నంలో బంగాళాదుంపలు నంజుకోవడం వాడికి ఎంతో యిష్టం.” అంటూ, ఆ మిగిలిన ముక్కలు రెండూ ఊడిచి ఆమె పెద్దకొడుకు కంచంలో పడవేసినది.

మోహనరావు తింటూఉన్న అన్నము వదిలి వేసి, ఉత్తరాపోశనము కోసం చేతిలో నీళ్ళు పోసుకుంటున్నాడు. అది చూసి భార్య—“అదేమిటండి, అలాగ!” అంటూ భర్త చెయ్యి పట్టుకుని, కూర్చోబెట్టడానికి ప్రయత్నంచేసింది. కాని అతను గట్టిగా చెయ్యి విదిలిపించుకుని బయటకు వెళ్ళిపోయాడు.

2

నేడు ఏకాదశి. మోహనరావు ఏకాదశినాడు ఉపవాసం ఉండడం ఆచారం. ఆయనతోపాటు తన భార్యకూడా ఉపవాసం ఉండడం అభ్యాసం చేసుకుంది. నాడు ఉదయంనుంచీ పిల్లలు “అమ్మా నేను ‘ఉపోసిం’ ఉంటానంటే నేను ఉపాసం ఉంటాను” అంటూ మొదలుపెట్టారు.

“అమ్మా, రామిగాడికి ‘ఉపోసిం’ అనడం రాక ‘ఉపాసం’ అంటున్నాడే.”

"అమ్మా, నేను బాగా అన్నాను కాదే?"

"ఉపోసిం అంటే ఏమిటనుకున్నావురా?"

"ఉపాసం అంటేనా? అంటే, మరీ—ఉపాసం ఉండడమన్నమాట."

"అంటే ఏమిటి?"

"అంటే ఏమిటా? అంటే—సాయింతరం పెసాదాలు తినడం అన్నమాట."

"అయితే నీకు మంచి బాగా తెలుసన్నమాట!"

"ఓ, నాకు మంచి బాగా తెలుసును."

"ఉపోసిం అంటే అదికాదు తెలుసా?"

"అయితే మరి నువ్వుచెప్పరా."

"చెప్పేదా? మరైతేనూ ఉపోసిం అంటే ఏమిటోనూ? ఉపోసిం అంటే, మరిగంటే, ఏమిటమ్మా, చెప్పమన్నావా? ఉపోసిం అంటే, మరీ—నాన్నగారూ అమ్మ ఉపోసిం ఉంటారు కదూ? అదీ. ఇప్పుడు తెలిసిందా?"

మోహనరావు అన్నాడు—'నువ్వు చెప్పిన దానికంటె తమ్ముడు చెప్పిందే బాగుందిరా.'

"అయితే ఉపోసాలు" అంటే పెసాదాలు తిందమూ."

మరి మనమంతా సాయంత్రం ప్రసాదాలు తింటాం కదూ!"

"అయితే నాన్నగారూ, కాఫీతాగి ఉపోసిం ఉండవచ్చునా?" అని అడిగేడు వెంకట్రావు.

"బువ్వతిని ఉపాసం ఉండొచ్చునా నాన్న గారూ?" అన్నాడు రామారావు.

"మంచి ఉపోష్యాలేనురా మీవి. కాఫీలు త్రాగీ, అన్నాలు తినీ ఎవళ్లైనా ఉపోష్యాలుంటారా ఎక్కడేనా?" అన్నది తల్లి నవ్వుతూ.

"అయితే మరి ఏమితినాలమ్మా?"

"ఏమీ తినకూడదు."

"ఏమీ తినకూడదా?"

"అహఁ, ఏమీ తినకూడదు."

"చల్దిఅన్నం తినొచ్చా?"

"తినకూడదు."

"పెసాదాలు తినకూడదా?"

"ప్రసాదాలు తినవచ్చు."

"అయితే వేగిరం పెసాదం చెయ్యమ్మా—నేనూ ఉపోసిం ఉంటాను."

"నేనూ ఉపాసం ఉంటానమ్మా."

"ప్రసాదం ఇప్పుడు కాదు తినడం. సాయింత్రందాకా, ఏమీ తినకుండా ఉండి, అప్పుడు స్నానంచేసి, ప్రసాదంచేసి దేముడికి నైవేద్యం పెట్టి అప్పుడు మనం తినాలి."

"దేముడుకి నైవేద్దిం ఎందుకమ్మా పెట్టడం?"

"దేముడు తిన్నాక మనం తినాలి."

"దేముడు తింటాడూ?"

"ఓ, మనం తింటాం కదూ. అలాగే దేముడూ తింటాడు."

"దేముడుకి నోరు ఉంటుందీ?"

"ఓ, ఎందుకుండదూ?"

"దేముడుకి చేతులూ వుంటాయా?"

"ఆ, చేతులూ వుంటాయి, కాళ్లూ వుంటాయి; ముక్కూ వుంటుంది, చెవులూ వుంటాయి."

"అయితే నేనూ నైవేద్దిం పెడతానమ్మా."

"నేనూ నైవేద్దిం పెడతానమ్మా."

"అందరూ పెట్టండి" అన్నది తల్లి.

"వీడు ఉపోసిం ఉండలేడమ్మా."

"నువ్వేనురా ఉండలేవు."

వాడి వూసు నీకెందుకురా? నీ సంగతేదో నువ్వు చూసుకుందూ" అన్నది తల్లి, వెంకట్రావుతో.

రామారావు ఎనిమిది గంటలవరకూ ఏమీ తినకుండా, ఉపాసం ఉంటానంటూ యిటూ అటూ గంతులువేసి తిరిగేడు. ఇంతలోకి కడుపులో కామయ్య గెంతులు వెయ్యగానే, చడీ చప్పుడూ లేకుండా వెళ్ళి చల్దికుండకు తలబడ్డాడు. వాడిని చూంచి వెంకట్రావు పరిహాసం చేసేడు.

"ఇదేనుట్రా ఉపోషిం వుండడం?"

"నావూసు నీకెందుకూ?"

"ఉపోషిం వుంటానని గొప్పలు చెప్పేవు మరి?"

"నాఇష్టం నేను ఉండను నీకేమీ."

"మరెందుకు గొప్పలు చెప్పేవు?"

"నా ఇష్టంరా! చెబుతే చెబుతాను."

పదిగంటలు అయినప్పటికి వెంకట్రావుకి కూడా ఆకలి వేసింది. తల్లి దగ్గిరికి వెళ్ళి 'అమ్మా! రామిగాడు అన్నం తినీసేడే.' అన్నాడు.

"అయితే ఏమంటావురా?"

"నేనుకూడా తినీసేదా?"

"నిన్నెవరు వద్దన్నారు అసలు?"

"అన్నం తినేస్తే, సాయింత్రం పెసాదం యిస్తావా?"

"అలాగలే."

మోహనరావు ఆఫీసుకుపోయి యథాప్రకారం సాయంత్రం 6 గంటలకి యింటికి వచ్చేడు. స్నానం చేసుకుని, జపం చేసుకుని, భగవద్గీత పారాయణ ప్రారంభించేడు. సీతమ్మకూడా స్నానంచేసి మడిబట్ట కట్టుకుని, గోధుమనూకా, నెయ్యి, పంచదారతో ప్రసాదం తయారుచేసింది. ఈలోపుగా, ఉండీ ఉడిగీ, పిల్లలు, ఇటూ అటూ తిరిగివచ్చి వంటింటి గుమ్మందగ్గర నిలుచుని లోపలికి తొంగిచూస్తూ 'అమ్మా, యింకా పెసాదం అవలేదూ? అమ్మా, దేవుడికి నైవేద్దెం పెట్టడం అయిందా?' అని ప్రశ్నలు వేస్తుండేవారు.

మోహనరావు గీతాపారాయణ పూర్తిచేసుకుని ప్రసాదం దేవుడికి నైవేద్యంపెట్టి కూర్చున్నాడు. సీతమ్మ తలకొక ఆకూ వేసి, ప్రసాదం అందరి ఆకుల లోనూ వడ్డించినది. భర్త నిర్బంధంమీద తనుకూడా ఒక ఆకువేసుకుని తనకుకూడా ప్రసాదం వడ్డించుకున్నది. గోపాలరావు తన ఆకులో వేసిన ప్రసాదపు ఉండలు రెండూ తినివేసి, మరి వద్దంటూ వెళ్ళిపోయినాడు. తక్కిన పిల్లలిద్దరూ తమ ఆకులలో వేసిన ప్రసాదపు ఉండలు రెండేసిన్నీ ఉండలు పాళంగానే గుటకాయస్వాహాచేసి, తల్లి మొఘంవైపుచూచి 'అమ్మా, తినీసేం' అని, యుద్ధంలో జయంపొందిన వీరులలాగ గొప్పగా చెప్పేరు.

"అమ్మా! నాన్నగారికి పెద్దపెద్ద ఉండలు వేసేవు. మాకు చిన్నచిన్నవి వేసేవు ఏం?" అన్నాడు రామారావు.

"నాన్నగారు పెద్దవాళ్ళు కదుట్రా, మరి! అంచేత పెద్ద వుండలు వేసింది మరి." అని సర్దుబాటు చెప్పేడు వెంకట్రావు.

"నేనూ పెద్దవాడినే" అన్నాడు రామారావు.

"నువ్వు నాన్నగారంత పొడుగున్నావేమిట్రా?"

"ఇదేమిటి చూసుకో! నాన్నగారికంటె ఎంత పెద్దవాడినో." అంటూ రామారావు నిలబడి చెయ్యి పైకెత్తి అన్నాడు.

మోహనరావు నవ్వుతూ, "అవునురా, నువ్వే పొడుగ్గా వున్నావురా" అంటూ తన ఆకులోనున్న ఒక ప్రసాదపు ఉండ రామారావుకీ, మరొక ఉండ వెంకట్రావుకీ పడవేశాడు.

సీతమ్మ అన్నది—"మీ రెందుకండీ వాళ్ళకి పడేస్తారు? నేను వెయ్యనూ?"

"నువ్వు వేసినవి తినేసేరుగా?"

"తినివేస్తే మరి వెయ్యనా యేమిటి?" అంటూ ఆవిడ మరి రెండు ఉండలు తీసి పిల్లలకు పడవేసింది.

"నువ్వు చిన్నచిన్న పిసరు ఉండలు పడేస్తావమ్మా. నాన్నగారైతే పెద్ద పెద్ద ఉండలు పడేస్తారు." అన్నాడు వెంకట్రావు.

"ఈవాళ ప్రసాదం మీకోసం చేసేనా, నాన్నగారికోసం చేసేనా?"

"నాన్నగారు తింటే మరి మేము తినమేటి?" అన్నాడు రామారావు.

"మీరేమీ ఉపోష్యం ఉన్నారా ఏమైనానా? నాన్నగారు ప్రొద్దుటినుంచీ మంచినీళ్ళయినా తాగలేదు. మీరు ప్రొద్దుటలేచి అప్పుడే రెండుమాట్లు మెక్కేరు. మళ్ళీ కాస్సేపటికి అన్నం తింటారు. మీకు నాన్నగారితో పొంతేమిటి? అంటూ, ఆవిడ మరి రెండు పెద్ద ఉండలు భర్త ఆకులో పడవేసింది. 'వాళ్ళకి పడెయ్యక మీరు తినండి. వాళ్ళకేమిటి అలాగ అరుస్తూనే వుంటారు.' అన్నది.

సీతమ్మ ఇప్పటికి ఒక ఉండ తిన్నది. ఒక ఉండ యింకా తన ఆకులో నున్నది. ఇక గిన్నెలో నున్న రెండు చిన్న ఉండలూ పిల్లలిద్దరికీ చెరిఒక ఉండ, పడవేసి, 'ఇదిగో చూసేరా? గిన్నెలోఉన్న రెండు ఉండలూ మీకు పడవేశాను. అవి తిని తిన్నగా వెళ్ళి చేతులు కడుగుకోండి—మళ్ళీ అడిగేరంటే తన్నుతాను. జాగర్త.'

ఒట్టి గిన్నిచూచి పిల్లలు నిరాశ చెందేరు. వారికి తిన్నదాంతో తృప్తి అయినట్టు ఏమీ కనిపించలేదు. తండ్రివైపు ఆశాపూరిత నేత్రాలతో చూస్తున్నారు. వాళ్ళ మొహాలు చూస్తూ సీతమ్మ చురచురలాడుతోంది.

"నాన్నగారూ, మీరు ఆ రెండు ఉండలూ తినీగలగరా?" అన్నాడు వెంకట్రావు.

మోహనరావుకి నవ్వు వచ్చినది. పిల్లలకి ప్రసాదం అంటే ఇంతా అంతా ఇష్టం కాదు. సాయింత్రం నాన్నగారు పెసాదాలు యిస్తారుగదా అని ప్రొద్దుట తను ఇంటి వద్ద నున్నంతసేపూ తనతోటి జుట్టుకట్టుకుని తిరిగేరు. చేతులు పట్టుకు వ్రేళ్లాడేరు. రెండు కాళ్ళకూ తమ చేతులు గట్టిగా చుట్టబెట్టి కదలకుండా చేసేవారు. 'నాన్నగారు నాకు ఎక్కువ పెసాదం యిస్తారురా' అంటే నాకు ఎక్కువ పెసాదం ఇస్తారురా' అని పంతాలుపడుతూ వచ్చేరు.

సాయంత్రం తను ఆఫీసునుండి వస్తూండగా యిద్దరూ ఎదురుగుండా పరుగెత్తుకువచ్చి, చెరొక చెయ్యీ పట్టుకుని యింటికి లాక్కునివచ్చేరు. 'నాన్నగారూ అమ్మ పెసాదం చేస్తోందండీ.' అని శుభవార్త వినిపించేరు. 'నాన్నగారూ, నాకు ఎక్కువ పెసాదం ఇస్తారు కదండీ?' అని యిద్దరూ అడిగేరు. నిజంగా, హడావిడి అంతా వాళ్లదే కదా. ఇట్టి ఆలోచనలు మోహనరావు మనస్సులో పరుగులెత్తేయ్. అతడు ఉండబట్టక తన ఆకులో నున్న రెండు ప్రసాదపు ఉండలూ ఇద్దరికీ చెరొకటీ పడవేసినాడు.

సీతమ్మకు పట్టరాని కోపమూ దుఃఖము వచ్చినది. తిరిగి భర్తకు వేద్దామంటే గిన్నెలో మరి లేవాయె. తన ఆకులోనున్న ఉండ తాను ఎంగిలిచేసినది. భర్తకు ఎల్లా వేయగలదు! 'వద్దండీ అని పోరుతూవుంటే, అలాగేనా చెయ్యడం? చాల్లెండి, మహా గొప్పపని చేసేరు!' అంటూ ఆవిడ తన విస్తట్లోనున్న ఉండనుకూడా పిల్లలవైపు విసిరివెయ్యడానికి ఎత్తబోతుండగా, మోహనరావు 'వద్దు, వద్దు' అంటూ ఆమె చేయి తన ఎడమచేతితో పట్టుకొన్నాడు. ఆమె మహా కోపంతో తనచేయి గట్టిగా విడిపించుకుని, ప్రసాదపు ఉండ విసిరేసి, బైటికి వెళ్ళిపోయింది.

3

నాడు స్వాతంత్ర్య దినోత్సవం. బడిలో పిల్లలకు మిఠాయిఉండలు పంచిపెట్టారు. రామారావు తనకిచ్చిన మిఠాయుండ తక్షణం ప్రారంభించి, నిమషంలో లేదనిపించేడు.

"అన్నయ్యా! నా మిఠాయి ఏదిరా?" అని చేతులు చూపిస్తూ నవ్వుతూ అడిగేడు.

"తినేసేవూ అప్పుడే? అమ్మకీ నాన్నగారికీ యివ్వక్కర్లేదుట్రా? అంతా మింగేసేవు?" అని అన్న గోపాలరావు అడిగేడు.

"నా కిచ్చేరూ! అంచేతనే తినీసేనూ!" అన్నాడు రామారావు మొఘం ముడుచుకుని.

వెంకట్రావు అప్పటికి సగం వుండ తినేసేడు; సగం చేతిలో ఉంది. "ఇదిగోటిరా, నేను ఈముక్క అమ్మకి అట్టే బెడతాను. రామిగాడు అంతా మింగీసేడు. అమ్మకి ఒకపిసరూ ఉంచేడు కాడు" అన్నాడు అన్నతో.

"ఎంగిలి చేసిందిట్రా, యిస్తావు, అమ్మకి?" గోపాలరావు అడిగేడు.

"ఎంగి లెక్కడ చేసేనురా! ఈ చేతిలో పెట్టుకుని యీ చేత్తో తీసుకు తిన్నాను." అని జవాబు చెప్పేడు వెంకట్రావు.

"అయితే అది తినెయ్యకుండా పట్టుకో అమ్మకిద్దూ గాని. నా ఉండ నాన్నగారికి యిస్తాను." అన్నాడు గోపాలరావు.

ముగ్గురు మూర్తులూ యింటికి బయల్దేరేరు.

ఇంట్లో అడుగు పెట్టగానే చిన్నవాళ్లిద్దరూ 'అమ్మా! మేమీవేళ మిఠాయిలు తిన్నాం!' అని దీర్ఘంతీస్తూ ప్రవేశించేరు.

"అమ్మా! రామిగాడు అంత వుండా వాడే తినేసేడే!" అన్నాడు వెంకట్రావు.

"నువ్వేం జేసేవురా?" అని తల్లి సీతమ్మ అడిగింది.

"నేను సగం నీకోసం పట్టుకొచ్చేను." అన్నాడు వెంకట్రావు.

"ఏదిరా, నువ్వు తెచ్చిన మిఠాయి?" అని గోపాలరావు అడిగేడు. తల్లి వాడివేపు చూస్తా నించుంది.

వెంకట్రావు తన చెయ్యి చూచుకుని గతుక్కుమన్నాడు.

"ఏదిరా, నువ్వు తెచ్చిన మిఠాయి?" అని గోపాలరావు గద్దించేడు. వెంకట్రావు మొఘం వెలవెల పోయింది.

"మర్చిపోయి దార్లో తినీసేనురా!" అన్నాడు, అపరాధిలాగ.

"మరి అమ్మకి అట్టేబెడతానని ఎందుకన్నావ్?" అని గోపాలరావు తమ్ముణ్ణి కసిరేడు.

"పోనీరా! కసరకు వాణ్ణి! ఊరుకో!" అని ఆమె గోపాలరావుతో చెప్పి, "ఏం చేసేవురా, రావూ, నీ మిఠాయి?" అని వెంకట్రావుని నవ్వుతూ అడిగింది.

"నీకు తెద్దాం అని పట్టుకొచ్చేనమ్మా. మధ్య దార్లో ఎక్కడో మర్చిపోయి తినేసేను. ఇప్పుడు చూస్తే చేతులో లేదు. అన్నయ్య చూడమ్మా, ఎలాగ దెబ్బలాడుతున్నాడోనూ! నేను తినియ్యాలని తినీసే నేమిటి మరి?" అన్నాడు.

వెంకట్రావు మొఘం చూసి సీతమ్మకి చాలా జాలివేసింది.

"వాడు తినలేదర్రా! మధ్య దారిలో కాకి ఎత్తుకుపోయి వుంటుంది. పోనీలే బాబూ నాకొద్దులే, ఫరవాలేదు" అని వెంకట్రావుని ఓదార్చింది.

"నీ మిఠాయి ఏదిరా, రామూ?" అని సీతమ్మ రామారావుని అడిగింది.

రామారావు నవ్వుతూ చొక్కా మీదికెత్తి బొజ్జ చేత్తో చూపిస్తూ, "ఇదిగో, ఇక్కడుంది. కావలిస్తే తీసుకో" అన్నాడు.

"అలాగట్రా? అయితే వుండు. కత్తిపీట తెచ్చి కడుపుకోసి ఆ మిఠాయుండ తీసుకుంటాం.' అన్నది తల్లి నవ్వుతూ.

ఆమాట వినగానే, 'నేను తెస్తానమ్మా కత్తిపీటా.' అంటూ వెంకట్రావు పంచాదిలోకి పరుగెత్తేడు.

"నేను మీకు దొరుకుతానేమిటి అసలు?" అంటూ రామారావు పెరట్లోకి పారిపోయేడు.

వెంకట్రావు కత్తిపీట పట్టుకొచ్చి 'రామిగాడు ఏడీ?' అని అడిగేడు తల్లిని.

"సరదాకి అంటే, నిజంగా పట్టుకొచ్చేవురా కత్తిపీట? వెధవ్వి నీ కడుపు కోసేస్తాను ఇలాగరా, ఎవళ్లైతే నేం." అంది తల్లి.

"అబ్బా! నేను కత్తిపీట తెచ్చిపెట్టినందుకా?" అంటూ వెంకట్రావు కత్తిపీట అక్కడ పారేసి నిర్లక్ష్యంగా నిలబడ్డాడు.

"ఈమాటు ఎప్పుడైనా, మిఠాయిలు పంచిపెడతారుకారూ, మాబళ్లో, అప్పుడేమోనూ, నీకు తెస్తానమ్మా!" అన్నాడు వెంకట్రావు తల్లితో.

అలాగేలేరా బాబూ? మీదటికి మళ్లీ సాతంత్రం వొస్తుంది కదూ! అప్పుడు తెద్దూగాని. అన్నది సీతమ్మ.

"అప్పుడు అంతా నీకే యిచ్చేస్తానమ్మా! ఒక్క పిసరూ నేను తినను." అన్నాడు వెంకట్రావు.

"అలాగేలే! ఇప్పుడింత ఇచ్చేవు, అప్పుడింక అంతా యిచ్చేస్తావు. దర్జాకేం లోటు లేదులే తండ్రికీ పిల్లలికీని!" అన్నది సీతమ్మ నవ్వుతూ.

గోపాలరావు తన మిఠాయుండ రెండు వంతులు వేసేడు. ఒక ముక్క తల్లికిచ్చి అన్నాడు, "ఇది నువ్వు తీసుకో అమ్మా! ఇది నాన్న గారికి."

మోహనరావు తల వంచుకుని ఏదో వ్రాసుకుంటున్నాడు.

"పిల్లల మాటలపై అతనికి ధ్యానములేదు. సీతమ్మ పిల్లల మాటలను విని ఆనందిస్తున్నది. భర్తకూడ, బయటికి రాలేదని వారి మాట వినలేదని, ఆమె విచారిస్తున్నది. ఆతనిని యివతలికి రప్పించడానికే పిల్లలతో తండ్రిని కూడా ఎత్తిపెట్టినది.

అంతవరకూ లక్ష్యపెట్టని మోహనరావు తన ప్రసక్తి రాగానే తక్షణం యివతలకు ఊడిపడ్డాడు.

"ఏమిటి దర్జాలూ, గిర్జాలూ ఎత్తిపెడుతున్నావ్? మా దర్జా కిప్పుడు వచ్చిన లోటేమిటో?" అన్నాడు భార్యాని ఉద్దేశించి.

"లోటు లేదనే, నేనూ చెబుతున్నాను. ఏం జట్టీకొచ్చేరా? జగడానికొచ్చేరా? అలా గదుగుతున్నారు?"

"జట్టీలూ జగడాలూ లేకుండా, పాపం! నీతో చట్టాపట్టాలు కట్టుకూర్చోమంటావు కబోసు! అంత తీరుబడి లేదు నాకిప్పుడు." అన్నాడు మోహనరావు.

"పిల్లలు మిఠాయిలు తెస్తే తిండానికేనా తీరుబడి లేదు పాపం! ఎంతసేపూ రాత రాత! బ్రహ్మ రాత!

"అవును గాని, దర్జా అంటున్నావేమిటి?" అని అడిగేడు మోహనరావు తాపీగా.

"మీకున్నదే దర్జా మొదటినుంచీని. మీరు మీదటికి చంద్రహారాలు చేయించి పెడతామన్నారు! మీ అబ్బాయి మీదటికి మిఠాయిలు తెచ్చిపెడతానన్నాడు. అంతకంటె ఏముంది?" అన్నది సీతమ్మ.

ఇంతలో గోపాలరావు తండ్రి ఎదుటికి వచ్చి నిలబడి "ఇందండి నాన్న గారూ!" అని తన మిఠాయి చేతిని తండ్రి ముందుకు చాపేడు.

"ఏమిట్రా ఇది?" అన్నాడు మోహనరావు.

"మిఠాయండీ." అన్నాడు గోపాలరావు.

"ఎక్కడిదిరా?" అని అడిగేడు తండ్రి.

"మా బళ్లో పంచిపెట్టేరండీ."

"నువ్వు తినలేదు మరీ?"

"నా కక్కరలేదండీ" అన్నాడు గోపాలరావు నిస్వార్థ బుద్ధితో. మోహనరావు భార్యతో అన్నాడు. 'చూసేవే, గోపిగాడు? వాడు తినకుండా, మిఠాయి నాకు తెచ్చియిచ్చేడు?" అన్నాడు. గోపాలరావు వేపుచూసి, 'మీ అమ్మకి ఇవ్వడం మానేసి నా కిచ్చేవేం?' అని అడిగేడు.

"అమ్మకీ సగం ఇచ్చేనండీ." అన్నాడు గోపాలరావు.

"ఉట్టి వెర్రినాగమ్మ అండీ! అందరిలాంటి వాడు కాదు గోపిగాడు. పాపం! ఒక్క పిసరూ నోట్లో వేసుకోకుండా పదిలంగా పట్టుకొచ్చి మన కిద్దరికీ పంచిపెట్టేడు. చూశారా?" అంటూ సీతమ్మ గోపాలరావుని దగ్గరగా లాక్కొని కౌగలించుకుంది. మోహనరావు వాడిని, సీతమ్మ చేతుల్లోంచి లాక్కొని ఎత్తుకున్నాడు. 'ఏంరా, నాన్నా! నువ్వు తిండం మానేసి మాకెందుకు తెచ్చేవు చెప్పూ?' అంటూ వాడిని గట్టిగా అదిమి పట్టుకున్నాడు.

"నాకు మళ్ళీ యిస్తారు నాన్నగారూ మా బళ్లోనూ" అని జవాబు చెప్పేడు గోపాలరావు.

సీతమ్మ భర్త ప్రక్కనే నిలబడి గోపాలరావు చెయ్యి పట్టుకుని వాని అరచెయ్యి ముద్దు పెట్టుకుంటున్నది.

వెంకట్రావూ, రామారావూ వింతగానూ, ఈర్ష్యగానూ వాళ్లవంక చూస్తూ, వాళ్లదగ్గరగా వచ్చి నించున్నారు. చేతులు మీదికి ఎత్తుతున్నారు.

మోహన్‌రావు గోపాలాన్ని క్రిందకు దింపేడు. తన చేతిలోఉన్న మిఠాయిలో కొంచెం తీసిపట్టుకుని, మిగిలినది గోపాలరావు చేతిలో పెట్టి "నువ్వు తిను నాన్నా" అన్నాడు వాత్సల్యపూరితమైన వాక్కులతో. గోపాలరావు తండ్రి యిచ్చిన మిఠాయి అందుకున్నాడు. కొంచం నోట్లో వేసుకున్నాడు. సీతమ్మ తన మిఠాయిలో కొంచంభాగం తీసి పట్టుకుంది. మిగతా మిఠాయి గోపాలరావు కిచ్చి, "ఇందరా, గోపీ, ఇది నా వంతు, తీసుకో" అన్నది. గోపాలరావు అదికూడా అందుకున్నాడు. తండ్రి యిచ్చినదీ, తల్లి యిచ్చినదీ కలిపి ఒక ఉండ చేసేడు. తింటూ నించున్నాడు.

"రావూ, చెయ్యి పట్టూ" అన్నాడు మోహన్‌రావు.

"రామా! చెయ్యి పట్టూ!" అన్నది సీతమ్మ.

రావు తండ్రిముందు చెయ్యి చాపేడు. రాము తల్లిముందు చెయ్యి చాపేడు. ఇద్దరి చేతుల్లోనూ మిఠాయిబూంది పడింది. ఇద్దరి మొఖాలూ దాగగ్లంత అయేయి.

ముగ్గురు పిల్లలూ ముందు నిలుచుని మిఠాయి తింటూంటే, భార్యాభర్తలు తమ అస్తిత్వాన్ని వాళ్ళల్లో ఐక్యంచేసి ఆనందాన్ని అనుభవిస్తున్నారు. ఇప్పుడు ఎవరిమీద ఎవరికీ కోపాలూ తాపాలూ ఏవీ లేవు. వారి హృదయాలు పునీతమైన పుత్రవాత్సల్యంతో పూర్తిగా నిండివున్నాయి!